కథ

**త్ర్యంబక జటోర్ఝాతే**
**గౌతమ స్యాఘనాశని**
**సప్తధా సాగరం యాన్తి**
**గోదావరీ నమోస్తుతే!!**

# సస్యశ్యామలం

ముందురోజు వరకూ ఉరకలేస్తూ వరదలైపారి శాంతించిన గోదావరిలో నడుములోతులో నుంచుని దోసిలితో గోదావరి జలాలు నింపుకొని అర్ధనిమీలిత నేత్రాలతో ఆ నదీమతల్లిని ధ్యానిస్తోంది విశాలాక్షి.

ఏనాటి కోరిక యిది. గోదావరి గడ్డమీద పుట్టి అయిదుపదుల వసంతాలు కావస్తున్నా, ఒక్కసారి కూడా గోదావరి స్నానం చేసే భాగ్యం కలగలేదు. ఇక పుష్కరస్నానం మాట దేవుడెరుగు. పోనీలే ఈనాటికైనా యిలా ఆ కోరిక ఈడేరిందనుకుందావిడ. తండ్రి ఉద్యోగరీత్యా, తర్వాత భర్త ఉద్యోగరీత్యా ఆంధ్రేతర ప్రాంతాల్లోనే యిప్పటివరకూ జీవితం సాగిపోయింది. భర్త కడపటి ఉద్యోగ పర్వం హైదరాబాదులో అవ్వడం వల్ల ఈమాత్రం అవకాశం దక్కింది. విశాలాక్షికి తెలుగుగడ్డంటే తెగ ప్రేమ. ఎవరికి మాత్రం వుండదు పుట్టింటి మీద ప్రేమా, పుట్టిన మట్టి మీద మమతా! వాటికి దూరమైన కొద్దీ తీపి యింకా పెరుగుతుందేమో. అందులోనూ గోదావరి తీరాలంటే విశాలాక్షికి మరీ మక్కువ.

అప్పుడే పైకి లేస్తున్న కమలబాంధవుడిని సంబరంగా చూస్తుండిపోయిందావిడ. వి.ఐ.పి. ఘాట్ అవ్వడం వల్లనూ, ఇంకా పొద్దెక్కలేదు గనక, జనం అంతగా లేరు. ఉన్న కొద్దిమందీ ఏ గందరగోళం లేకుండా భక్తిశ్రద్ధలతో పుష్కరవిధుల్ని ఆచరిస్తున్నారు. చూపు ఆనినంతవరకూ, గోదావరమ్మని తనవితీరా ఆప్యాయంగా, సంతోషంగా చూసుకుంటోంది విశాలాక్షి. రెండు చేతులూ ఎత్తి గోదావరితోపాటు, కొలువైయున్న ముక్కోటి దేవతలకీ మనసారా మొక్కుకుంది. అలలు అలలుగా గోదావరి తనని తాకుతుంటే, ఆ నదీమతల్లి తన చల్లని చేతులతో నిమురుతున్నట్లనిపించి తెలియని తృప్తి తనువంతా అలుముకుంది.

ప్రక్కనే వున్న భర్తవైపు చూసింది. మొక్కుబడిగా వచ్చిన మనిషాయె! ముక్కు మూసుకొని, మూడు మునుగులు మునిగి బయటపడాలని చూస్తున్నారాయన. కానీ తను ముందే చెప్పింది. ఈ ఒక్కరోజైనా తను చెప్పినవన్నీ వినాలనీ, చెయ్యాలని. ఒప్పుకొని వచ్చిన మాట నిజమైనా, కాస్తంత రేస్ట్‌లేస్ ఫీలింగుని మాత్రం దాచుకోలేకపోతున్నారాయన. సరిగంగ స్నానాల మాట దేవుడెరుగు, కనీసం గోదావరిలోనైనా దిగారు, అదే పదివేలనుకుందావిడ. రవికిరణాలు ఆయన పచ్చని శరీరాన్నింకా మెరిపిస్తున్నాయి. మురిపెంగా చూసుకుంది భర్తని విశాలాక్షి. తెల్లని పంచెలో, చేతిలో చెంబుతో నుంచున్న ఆయన్ని చూసి తమాషాగా అనిపించి ఆవిడ పెదాలపై చిరునవ్వు చిందింది.

''గోదావరి, గోదావరంటూ పరిగెట్టుకొచ్చి, యిప్పుడు కొత్తగా నా ముఖం చూస్తావేంటి విశాలా, త్వరగా కానియ్! ఏవేవో చేసేసి పుణ్యం పోగేసుకోవాలని ఒకే ఆరాటపడ్డావు కదా'' చిరుచిరాకయిన గొంతుతో.

ఇంతలో అంజి మెట్లు దిగుతూ ''అమ్మా! పంతులుగార్ని పట్టుకొచ్చాను. ఇదిగో పూజ సామాన్ల సంచి. అందులోనే వున్నాయి అన్నీ. నేను వెళ్తున్నా. సామాను దగ్గరుంటాను. ఏదన్నా కావాలంటే పిలవండి'' అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు సామానెవరైనా ఎగరేసుకు పోతారనే భయంతో.

పంతులుగారు సంకల్పం చెప్పి పుష్కరస్నాన మంత్రాలు చెబుతూ పూజ చేయిస్తున్నారు.

''పంతులుగారూ! గోదావరమ్మకీ చీరా, రవికెల గుడ్డ సమర్పించాలండీ'' విశాలాక్షి బట్టలున్న కవర్ తీస్తూ అంది.

''ఎలా సమర్పిస్తావ్! ఆవిడొచ్చి తీసుకుంటుందా? పాపం విశాలాక్షి ప్రేమతో పసుపుకుంకుమలిస్తుందని?'' ఎగతాళి చేశారు విశాలాక్షి భర్త.

''మీక్కనిపించదేమోకాని, నాకా తల్లి కనిపిస్తుందిలెండి. అన్నీ ఎకసక్కెపుమాటలే! పంతులుగారూ! సంకల్పం చెప్పి ఆవిడ వళ్ళో పెట్టాలండీ'' పసుపూ, కుంకుమా, గాజులూ వగైరా సర్దుతూ అంది విశాలాక్షి.

''అంటే ఏమిటి? కొంపదీసి నదిలోకి విసిరేస్తావా?'' భర్త ఆందోళన.

''అబ్బా విసిరేయడమేమిటండీ. ఆవిడ వళ్ళో పెడ్తానంటూంటేనూ'' విసుక్కుంది విశాల.

''విశాలా! మూర్ఖత్వానికైనా ఓ హద్దుండాలి. చీర నీళ్ళలో వదలడమేమిటి? ఏ పేద పేరంటానికైనా బొట్టు పెట్టిస్తే పుణ్యమూ, పురుషార్థమూ కలిసి వస్తాయి కదా''

''నేనూ అలాగే అనుకున్నాను. కానీ నేను విన్నంతవరకూ, అందరూ ఆ తల్లి ఒళ్ళోనే పెడ్తున్నారు. అంతెందుకు మన ముఖ్యమంత్రిగారూ పట్టుచీర సమర్పించలేదా? అసలు నేనూ పట్టు చీర కొందామనుకున్నాను. మీ పోరెక్కువవుతుందని విరమించుకున్నాను'' మూతి ముడుచుకుంది విశాలాక్షి.

''అయ్యా! అమ్మగారి అభిలాషని కాదనకండి. గోదావరిని మించిన ముత్తైదువేది స్వామీ?'' పంతులుగారు వత్తాసు పలికారు.

యధావిధి సంకల్పం చెప్పి చీర, రవికెల బట్టని నదిలో విడిచిపెట్టాలి. కానీ ఘాట్‌ని కవర్ చేస్తూ పడవలు అడ్డుగా పెట్టారు ప్రమాదాలు జరగకుండా. ఈతగాళ్ళు వాటిలో కాపలాగా కూర్చున్నారు. ప్రమాదవశాత్తూ ఎవరైనా కాలుజారితే కాపాడడానికి అప్రమత్తంగా వున్నారు వాళ్ళు. ఉన్నచోటే వదిలితే చీరని వాళ్ళు తీసేసుకుంటారు. అంచేత విశాల చెప్పింది భర్తతో- పడవదాకా జాగ్రత్తగా వెళ్ళి స్పీడ్‌గా దూరంగా గోదావరిలోకి వేయమంది. తు.చ. తప్పకుండా ఆయనలాగే చేశారు. కానీ చీరలా దూరంగా తేలిపోతుండగానే గజ ఈతగాడు గోదాట్లోకి దూకి వాళ్ళ కళ్ళముందే దాన్ని పట్టుకొని పదిలంగా తెచ్చేసుకున్నాడు.

ప్రాణం వుసూరుమంటుంటే ''పోనీలే, వాడి భార్యైనా గోదారి పేరు చెప్పుకొని కట్టుకుంటుంది'' అంది విశాల సంజాయిషీ యిస్తున్నట్టుగా.

''వాడి భార్య కాదు కట్టుకునేది ఇలా నీలా వేసిన చీరలన్నీ పోగేసి వాడమ్ముకుంటాడంతే'' ఉడికించారాయన .

''సరే మిగతా తంతులన్నీ ముగించుకొని పైకొచ్చెయ్ త్వరగా'' అంటూ వెనక్కి తిరగబోయారాయన.

ఇంతలో అంజి ఆయన సెల్ పుచ్చుకొని అంగకో మూడుమెట్లు చొప్పున దిగుతూ ''అమ్మా! అమెరికా నుంచి అమ్మాయిగారి ఫోను'' రొప్పుతూ సెల్ అందించాడు.

''నువ్వు త్వరగా వెళ్ళు సామాను దగ్గరకి''

అంటూ సెల్ అందుకుంది ఆవిడ. ఎక్కడినుంచొచ్చాయో మరి అన్ని తారకలు విశాలాక్షి కళ్ళల్లో తళుక్కుమన్నాయి కూతురి ఫోననగానే.

''అమ్మా! హిమా ఎలా వున్నారు తల్లీ?''

''మేమంతా బాగున్నాంకాని, చివరికి పుష్కర స్నానం సాధించావుకదమ్మా!'' నవ్వుతూ అంది హిమజ.

''ఆ! ఏదీ యిన్నాళ్ళకి. దీనికోసం ఎంత పోరాడాల్సొచ్చిందని. మీ నాన్నగారు, లీవు లేదనొకసారి, ఏం వెళ్తాంలే అనొకసారి తెగ నసపెట్టారు. చివరికి గెలిచానులే ఈ చిన్న విషయంలోనైనా. నిన్న ప్రొద్దుట కారులో మన అంజితో సహా బయలుదేరి ఏలూరు చేరుకున్నాం. సాగర్ మామయ్యింట్లో మకాం! వాళ్ళింట్లోనూ పుష్కర బంధువుల కోలాహలమే! మళ్ళీ ఇవ్వాళ తెల్లవారు ఝామున నాలుగు గంటలకి బయలుదేరి, తెల్లారేసరికి రాజమండ్రి చేరుకున్నాం. మన అంజి డ్రైవింగ్ కెపాసిటీ నీకు తెలుసుగా'' గుక్కతిప్పుకోకుండా చెప్పిందావిడ కూతురికి.



''ఎలా వుందమ్మా అక్కడంతా? రాజమండ్రంతా తిరణాలే కదూ? బలే సరదాగా వుండుంటుంది కదమ్మా'' హిమజ గొంతులోనూ సరదా!

''ఎందుకుండదురా? అసలు గోదావరిని చూస్తుంటేనే ఆనందంలో గుండెలు గంతులేస్తాయి కదా! ఈ పన్నెండు రోజులూ ఈ దక్షిణ గంగలో సకల దేవతలూ, ఋషులూ, బృహస్పతీ తీర్థాధిపతి పుష్కరునితో కలిసి కొలువై యుంటారట. అందుకే పుష్కర స్నానికంత విశేష ఫలితం. రేవా తీరే తపః కుర్యాత్, మరణం జాహ్నవీతటే, దానం దద్యాత్ కురుక్షేత్రే, గౌతమ్యాం త్రితయం పరమ్! నర్మదాతీరాన తపస్సు, గంగాదేవి ఒడ్డున మరణం, కురుక్షేత్రంలో దానం, చాలా గొప్పవట. కానీ గౌతముడు భూమికి తెచ్చిన గోదావరి తీరాన, పై మూడు కార్యాల ఫలం అమితంగా దక్కుతాయిట'' చెప్పుకుంటూ పోతోంది విశాల ఏదో ట్రాన్స్‌లో వున్నట్లుగా.

''అయితే నువ్వు చాలా పుణ్యాన్ని సంపాదిస్తున్నావన్నమాట'' సరదాగా నవ్వింది హిమ.

''నేను చేసేదేదీ నాకోసం కాదమ్మా! మీకోసం, నా కుటుంబం కోసం. నా వాళ్ళు నిండు నూరేళ్ళూ పచ్చగా, చల్లగా బ్రతకడం కోసం. ఏమిటో మేమిన్నాళ్ళూ ప్రవాసాంధ్రులంగా గడిపాం. మీరేమో ఏకంగా ప్రవాస భారతీయులై పోయారు''

''ఏం చేస్తామమ్మా! జీవితం ఎక్కడికి లాక్కుపోతే అక్కడికి పోవాల్సిందే కదా!'' హిమ వేదాంతం.

మొలలోతు జలంలో తడిసి వంటికంటుకున్న కుంకుమ రంగు పట్టుచీర, పచ్చని ముఖం మీద ఎర్రని బొట్టు నుండి సన్నగా కారుతున్న నీళ్ళు, రెండు చేతుల నిండుగా బంగారు గాజుల నడుమ ఆకుపచ్చ, ఎరుపుగాజులు. ఒక చేయి సెల్‌తో చెవి కానించుకుంటే, రెండో చేతినిండా పూలుంచుకొని ఇహలోక ధ్యాస లేకుండా మాట్లాడుతున్న విశాలను చూసి భర్తకి నవ్వుతోపాటు ముచ్చటావేసింది. ఆ దృశ్యం సనాతన సాంప్రదాయం, సాంకేతిక విజ్ఞానం సమ్మేళనమై భూదేవికి చెరో వైపునా వున్న తల్లీకూతుళ్ళని అనుసంధానం చేస్తున్నట్లుగా, గమ్మత్తుగా అనిపించి ఆ ఘాట్‌లో వున్న వాళ్ళంతా వింతగా, సరదాగా చూస్తున్నారు. అందులోనూ విశాల ఉత్సాహంతో తనకి తెలియకుండానే వాల్యూమ్ పెంచి మరీ మాట్లాడుతోంది.

యస్. సుభాషిణి

పక్కవాళ్ళని పట్టించుకోకుండా మళ్ళీ మొదలుపెట్టింది ముచ్చట్లావిడ.

''అసలు హిమా! నీకు కాటన్ దొర సంగతి తెలుసా? ఏ జన్మ అనుబంధమో గోదావరన్నా, ఆ తీర ప్రజలన్నా ఆయనకి అవ్యాజమైన ప్రేమ. ఆనకట్టలు కట్టి గోదావరిని ఒక తీరులో నడిపించిన అపర భగీరథుడాయన. వృధాగా పోతున్న గోదావరి జలాల్ని పైరుల్లోకి మళ్ళించాడు. ఆ నదీమతల్లి కూడా ఆయన చెప్పినట్లు వింది.

గోదావరి జిల్లాల్ని సస్యశ్యామలం చేసి సిరులు కురిపించాడా కాటన్ మహానుభావుడు. ఆ తల్లిని ప్రేరేపించి డెల్టా రైతన్నలకి భిక్ష పెట్టించి అన్నపూర్ణని చేశాడు. గోదావరి చిందులేసిన దారంతా ధాన్యాగారమైంది. ఎక్కడ పుడితేనేం, ఇక్కడి వాళ్ళ గుండెల్లో గోదావరితోపాటు తనూ కొలువై వుండిపోయాడు. అందుకే ఈ శుభవేళ కాటన్ మహానుభావుడు గుర్తొచ్చి మనసులోనే నమస్సులు అర్పించానమ్మా'' విశాల భావోద్వేగం.

## ఇషా హుషారు

**కంపెనీ, ఖల్లాస్ చిత్రాల తరువాత ఇషా నటించిన పింజర్ చిత్రం ఇప్పుడు అన్ని చోట్లా చర్చనీయాంశం అయింది. మంచి కమర్షియల్ చిత్రం అని అంతా అంటున్నారు. కేవలం ఐటెం నెంబర్ సాంగ్స్‌కే పరిమితం కాకుండా భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని ఇషా ఇందులో చాలా బాగా నటించింది. పాత్ర చిత్రాలకి ఇప్పటికీ ఆమెలో ఎంతో పరిణితి కన్పించిందంటున్నారు. ఈమె నటించిన కొన్ని సీన్స్ సెన్సార్ బోర్డు సూచనల మేరకు కట్ చేయబడ్డాయని అంటుండగా ఆమె మాత్రం అలాంటివేవీ జరగలేదని కేవలం తన ప్రారంభపు సీన్ మాత్రం కొంచెం మార్చారని అంటోంది. దీంతోపాటు ఈమె నటించిన కొత్త చిత్రాలు 'రుద్రా, హమ్‌రాహి, వందేమాతరం, టాంగో చార్లి, శ్రీకృష్ణ కాటేజ్ నెం:16' త్వరలో విడుదలకి సిద్ధం అవుతున్నాయి.**

''అమ్మా! చాలా ఎమోషనల్‌గా వున్నావు కదూ?'' ఆర్ద్రంగా పలికింది హిమ.

''అవును తల్లీ! మనకోసం మనం జీవించడం కాదు నలుగురి బాగుకోసం పాటుపడ్డమే గొప్పతనం, మంచితనం. వందల సంవత్సరాల తర్వాత కూడా గోదావరితో పాటు కాటన్‌గార్ని ప్రేమగా, గౌరవంగా తలుచుకుంటున్నామంటే, అది ఆయన చేసిన సత్కార్యం వల్లనే కదా! సద్భావాలు, మంచి మనసులూ వుండడం కూడా ఆ దేవుడిచ్చిన అదృష్టాలేనేమో. ఆ పుణ్యాల రాసి గోదావరి మాత్రం నడిచినంత దూరం తనకి రెండు వైపులా సస్యశ్యామలం చేసేసింది. త్ర్యంబకంలో పుట్టిన ఆ తల్లి బాసరలో మన గడ్డ మెట్టింది. తొలి మజిలీ బాసరైతే, తుది మజిలీ అంతర్వేది. ప్రవహించినంతమేరా పసిడి పైరులతో దీవించింది ప్రజల్ని. అంతర్వేదిలో సాగరునితో సంగమం. ఏమిటో! నువ్వూ, అల్లుడూ, పిల్లలూ అందరూ వుండుంటే, గోదావరి ఆశీర్వాదాలు దక్కేవికదా'' విశాల కళ్ళు తడయ్యాయి.



అది కనిపెట్టిన హిమ ''అమ్మా ఏంటిది? మేమక్కడ లేకపోయినా అన్నీ కళ్ళకి కట్టినట్లుగా వివరించావు. నీతో మాట్లాడుతుంటే నా మనసు నీతోపాటుగా గోదావరి తీరానే తారట్లాడుతుంది. నువ్వున్నావుకదా, ఏం చేసినా నువ్వు మా కోసమేనని. మరింకేం? నీ పుణ్యం మాది కాదా? గోదావరి మాత్రమే కాదమ్మా, ఏ తల్లైనా తన ప్రేమానురాగాలతో తన పిల్లల్నీ, కుటుంబాన్నీ సస్యశ్యామలం చేస్తుంది. తన పిల్లలు పదికాలాల పాటు పచ్చగా బతకడానికే ప్రతి తల్లీ పాటుపడ్తుంది.

మేమిక్కడ లేకపోయినా, గోదావరి పాదాల దగ్గరున్న నీ ద్వారా ఆ ముక్కోటి దేవతల దీవెనలూ ఇంకా మహత్తుని సంతరించుకొని మాకు అందుతున్నాయమ్మా. దిగులుపడకు.

అయినా కన్నతల్లి ఆశీర్వాదాల్ని మించినవి ఇంకేమున్నాయమ్మా?'' హిమ ఎమోషనల్‌గా మాట్లాడేస్తోంది.

అంతవరకూ పూజ సామాను పట్టుకొని తన సంభాషణని ఆసక్తిగా వింటున్న పంతులుగారి మీద దృష్టిపడిన విశాలాక్షి-

''అయ్యో పంతులుగారూ! మిమ్మల్ని నిలబెట్టేశానుకదా!'' అంటూ నొచ్చుకుంది.

''పరవాలేదమ్మా! మీకూ, మీ అమ్మాయిగార్కి మన సంప్రదాయాల మీదున్న గౌరవం, శ్రద్ధా చూస్తుంటే సంతోషంగా వుందమ్మా'' చిరునవ్వుతో అన్నారాయన.

అంతలో ఏదో గుర్తొచ్చినట్లుగా ''పంతులుగారూ! మీరేమీ అనుకోకపోతే మా అమ్మాయినీ, వారి కుటుంబాన్నీ ఆశీర్వదించండి'' ఆ కన్నతల్లి ఆపేక్ష.

''ఎంతమాట! దివ్యంగా ఆశీర్వదిస్తాను. ఆ సెల్లు ఇటివ్వండి'' అంటూ ''ఒరే అబ్బాయ్! ఇటు రారా ఓ మాటు'' ప్రక్కగా వెళ్తున్న మరో చిన్న పంతుల్ని పిలిచారాయన.

ఈలోగా విశాల ''హిమా! పంతులుగారు ఆశీర్వదిస్తారురా'' అంటూ సంబరపడింది.

''ఉండమనమ్మా! నేను స్పీకరాన్ చేసి రికార్డు చేసుకుంటాను. పూజలూ, పండగలప్పుడూ వినడానికి పెట్టుకుంటాను'' హిమ ఉత్సాహపడింది.

పెద్దపంతులుగారూ, చిన్నపంతులుగారూ ''శతమానంభవతి'' అంటూ మొదలుపెట్టి గంభీరమైన కంఠాలతో ఆశీర్వచనాలు శ్రావ్యంగా పలుకుతుంటే, అక్కడున్నవాళ్ళంతా, ఈ తంతంతా చూసి ఆనందంతోనూ, సంభ్రమంతోనూ నిలుచుండిపోయారు.

అంతవరకూ చిర్రుబుర్రులాడిన హిమ తండ్రిగారు కూడా కూతురికి ఆశీర్వచనాలందుతుంటే చిరాకు మర్చిపోయి సంతోషంగా, ప్రసన్నంగా మారిపోయారు. బ్రాహ్మలు పలుకుతున్న ఆశీర్వచనాలన్నీ ఆ గోదారి తీరాన మార్మోగి, అవి వాళ్ళకే అందుతున్నాయన్నట్లుగా భక్తులు శ్రద్ధగా వింటున్నారు.

ఆంధ్రాలో బయలుదేరిన గోదావరి తల్లి, కన్నతల్లి, ముక్కోటిదేవతల ఆశీశ్శులు అలా అలా గాలితరంగాల్లో తేలియాడుతూ అమెరికాలోని ఇంటి ఆడపడుచుకి అందుతుంటే, విశాలాక్షి కళ్ళల్లో ఆనందబాష్పాలు!

పుష్కర వైభవాన్ని కవర్ చేస్తున్న ఓ కుర్ర విలేకరి క్లిక్‌మనిపించి ఆ సుందర దృశ్యాన్ని పట్టేశాడు తన కెమెరాలో!

కన్నకూతుర్నాశీర్వదించిన పంతుళ్ళిద్దరికీ విశాలాక్షి నుంచి ఘన సత్కారాలందాయని చెప్పక్కర్లేదుకదా!